క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

రాజుపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2025–26 సంవత్సరానికి అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బి.మల్లిఖార్జున శర్మ గురువారం తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే విధంగా పాఠశాలలో 7, 8, 9, 10 తరగతులలో, ఇంటర్మీడియెట్‌లో మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వెంకటాయపాలెంలో పశు వైద్య శిబిరం

బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో సంగం డెయిరీ సహకారంతో గురువారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పాల కేంద్రం అధ్యక్షురాలు బాణావతు అంజలి బాయి తెలిపారు. పశు వైద్య శిబిరంలో 40 గేదెలు, 10 ఆవులు, 40 మేకలకు డెయిరీ సీనియర్ పశు వైద్యులు ప్రసాద్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంగిరెడ్డిపాలెం వెటర్నరీ డాక్టర్ కరీం, టెస్టరు దీపాల కోటేశ్వరరావు, యశ్వంత్, ఆనంద్ బాబు, శ్రీనివాస్, సూపర్‌వైజర్ సుధీర్ బాబు, గ్రామ నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



నార్నెపాడు(ముప్పాళ్ళ): రీ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవాని శంకర్ ఆదేశించారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ భవానిశంకర్ గురువారం తనిఖీ చేశారు. ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వే ప్రాంతంలో ఉన్న రైతులతో మాట్లాడారు. రైతుల సమక్షంలోనే సర్వే పూర్తి చేయాలని, వారి వద్ద నున్న ఆధారాలతో, ప్రభుత్వం వద్ద రికార్డులు, కొలతల ద్వారా వచ్చే విస్తీర్ణాన్ని సరిచూసుకోవాలన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా సర్వే పూర్తి చేయాలని సూచించారు. మండల సర్వేయర్ టి.సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

31లోపు ఈ కేవైసీ చేయించుకోవాలి

ముప్పాళ్ళ: మండలంలోని రేషన్ కార్డుదారులు ఈ నెల 31లోపు ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ గురువారం విలేకరుల సమావేశంలో చెప్పారు. మండలంలో మొత్తం 37,389 రేషన్ కార్డులకు గాను 3,505 కార్డుదారుల ఈ కేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. ఈ నెలాఖరులోపు నమోదు చేయించుకోకుంటే రేషన్ సరుకులు నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. కార్డుదారులు త్వరితగతిన ఈ కేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు.

అక్రమ విద్యుత్ వినియోగం నేరం

రెంటచింతల: మీటర్లను ఏర్పాటు చేసుకోకుండా అక్రమంగా విద్యుత్‌ను వినియోగించుకోవడం చట్టరీత్యా నేరమని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పలు కాలనీల్లో ఆయన స్థానిక సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విద్యుత్ మీటర్ల పనితీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. అక్రమ పద్ధతుల ద్వారా విద్యుత్‌ను వినియోగించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వివిధ స్లాబ్‌ల కింద విద్యుత్‌ను వాడుకుంటున్న వినియోగదారులందరూ ఇప్పటి వరకు ఉన్న తమ విద్యుత్ బకాయిలను స్థానిక విద్యుత్ అధికారులకు వెంటనే చెల్లించి, సహకరించాలన్నారు.


మహిళలు ఆర్థికంగా ఎదగాలి



పిడుగురాళ్ల: మహిళలు ఆర్థికంగా ఎదగాలని వెడ్స్ సంస్థ డైరెక్టర్ ఎం.స్వర్ణలతాదేవి పేర్కొన్నారు. పిడుగురాళ్లలో గురువారం ఆ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలిచే విధంగా కార్ప్స్ సంస్థ శిక్షణ ఇచ్చి, 9 మందికి కుట్టు మిషన్లు అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్రాక్ స్కూల్ హెచ్‌ఎం పి.లతా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, కార్ప్స్ సంస్థ డైరెక్టర్ కె.మేరి, సూపర్‌వైజర్ అనిత, షేక్ సైదా, మస్తాన్ వలి, బాష, పటాన్ ఖాసీం తదితరులున్నారు.

ఒంటి పూట బడి.. అప్రమత్తం కండి..!

- సరదాల మాటున పొంచి ఉన్న ప్రమాదాలు
- ప్రారంభమైన ఒంటి పూట బడులు
- బడి వదిలాక పిల్లల భద్రతపై కన్నేయాలి



సత్తెనపల్లిలోని గుంటూరు రోడ్డులో నీటి ప్రవాహంతో గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువ

సత్తెనపల్లి: ఎండల సమయంలో నీటిని చూడగానే పిల్లల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. తమకు ఈత రాదనే విషయం కూడా మర్చిపోతారు. తాము దిగుతున్న నీటి కుంటలు, చెరువులు, బావులు, కాలువలు, వంకల్లో లోతు తెలియక ప్రాణాలు కోల్పోతున్నారు. అన్ని యాజమాన్య పాఠశాలలకు శనివారం నుంచి ఒంటి పూట బడి ప్రారంభమైంది. పిల్లల ఆనందానికి అవధులు లేవు. మధ్యాహ్నం నుంచి పాఠశాలలకు సెలవు కావడంతో బడి నుంచి ఇంటికి రాగానే పుస్తకాల బ్యాగును మూలన పడేసి ఎంచక్కా ఆటల బాట పడుతుంటారు. ఈ ఆనందం వెన్నంటే విషాదాలు కూడా పొంచి ఉన్నాయి. ఈత, మోటార్ సైకిల్ రైడింగ్, క్రికెట్ వంటివి మండే ఎండలో చిన్నారులను ముప్పుతిప్పలు పెట్టేవే. వీటి నుంచి పిల్లలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. వీటి వల్ల జరిగే ప్రమాదాల గురించి పిల్లలకు అవగాహన పెంచాలి.

టీవీలతోనూ ముప్పే

ఒంటి పూట బడుల సమయంలో పాఠశాల అయిపోగానే చిన్నారులను ఇంటికి తీసుకుని వచ్చి భోజనం చేయించి కొద్దిసేపు పడుకునేలా చూడాలి. ఆ తర్వాత ఇంటి పరిసరాల్లో, చెట్ల నీడలో ఆడుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. అలా కాకుండా ఇంట్లో నిత్యం టీవీలు, కంప్యూటర్, సెల్, ల్యాప్‌టాప్‌లు వీడియో గేమ్‌లకు అతుక్కుపోవడం వంటి వాటి వల్ల పిల్లల్లో దృష్టి లోపం తలెత్తే అవకాశం ఉందని నేత్ర వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎండలతో అనర్థం

మార్చి నుంచే ఎండలు మండుతున్నాయి. పిల్లలు వీలైనంత వరకు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ సమయం ఎండలో ఉండడం వల్ల శరీరం వేడెక్కి పిల్లలకు వాంతులు, విరేచనాలు అయ్యే ప్రమాదం కూడా ఉంది. ఎండ తాకిడికి ఒంటిలోని నీరంతా చెమట రూపంలో ఇంకిపోయి వడదెబ్బ తగిలే ప్రమాదం కూడా ఉంది. ఎండలకు పిల్లలు అధిక నీరు తాగేలా చూసుకోవాలి. అప్పుడప్పుడు మంచి నీటిలో చిటికెడు ఉప్పు, చక్కెర వేసి ఇవ్వడం మంచిది. కొబ్బరి నీళ్లు తాపడం వల్ల నీరసం తగ్గి ఉత్తేజంగా ఉంటుంది.

చెరువులు, బావులతో ప్రమాదం

గ్రామ శివారుల్లో బావులు, చెరువులు, కాలువలు, వంకలు, కుంటలు ఉంటాయి. వీటిలో సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా పెద్దలను వెంట బెట్టుకొని వెళ్లాలి తప్ప ఒంటరిగా వెళ్లకూడదని పిల్లలకు చెప్పాలి.

ఇవి అలవాటు చేయాలి

- ఒంటి పూట బడి వదలగానే మధ్యాహ్నం వేళ పిల్లలను అవసరమైతే తప్ప బయటికి పంపకూడదు.
- తల్లిదండ్రులు పిల్లల కోసం అధిక సమయం కేటాయించాలి. ఖాళీ సమయాల్లో పిల్లలు విజ్ఞాన, వినోదానికి సంబంధించిన పుస్తకాలు చదివేలా అలవాటు చేయాలి.
- ఇంటిలోనే ఉంటూ నీడ పాటున ఆటలు ఆడుకునేలా చూడాలి.
- పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి బయటకు వెళ్లేలా వారికి అవగాహన కల్పించాలి.

బెల్లం కొనుగోలుదారుల వివరాలు పంపాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి



బెల్లం వ్యాపారస్తులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ తులసి

అచ్చంపేట: సారా తయారీలో ప్రధానంగా పటిక, నల్లబెల్లం, బెల్లం వంటి వాటిని ముడిసరుకుగా వినియోగిస్తారని, అలాంటివి ఎవరెవరు కొంటున్నారు, వారు ఎక్కడికి తీసుకెళుతున్నారు వంటి పూర్తి వివరాలను ప్రతి 15 రోజులకొకసారి తమకు ఇవ్వాలని బెల్లం వ్యాపారస్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి కోరారు. మండలంలోని బెల్లం వ్యాపారస్తులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటు సారా నిర్మూలన దిశగా ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తుందన్నారు. అందుకు వ్యాపారస్తులంతా సహకరించాలన్నారు. బెల్లం కొనుగోలుకు వచ్చే వారిలో ఎవరైనా అనుమానితులు ఉన్నట్లయితే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. అలాంటి వారితో వ్యాపారస్తులు లాలూచీపడడానికి ప్రయత్నిస్తే క్షమార్హం కాదని, తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇన్‌స్పెక్టర్ తులసి హెచ్చరించారు. అలాగే ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయిస్తే షాపులపై చర్యలు తీసుకుంటామని, లైసెన్సులు క్యాన్సిల్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ తులసి మద్యం దుకాణాదారులను హెచ్చరించారు. మండలంలోని వైన్ షాపులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి గురువారం తనిఖీ చేశారు. మద్యం దుకాణంలోని స్టాక్ రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



పీసపాడులో మిర్చి రైతులు, కూలీలతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

క్రోసూరు: క్వింటా మిర్చికి రూ.21 వేలు మద్దతు ధర ప్రకటించి నేరుగా కౌలు రైతుల నుంచే కొనుగోలు చేసి ఆదుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు కంచేటి పెద్దబ్బాయి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం, సీపీఐ బృందం ఆధ్వర్యంలో పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని పీసపాడు, ఎర్రబాలెం, 88 తాళ్లూరు గ్రామాల్లో పర్యటించి మిర్చి పొలాలను, కల్లాలోని మిర్చిని పరిశీలించారు. మిర్చి ధరల గురించి రైతులను, కౌలు రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఒక ఎకరంలో మిర్చి పంట పండించడానికి రూ.2,52,500 పెట్టుబడి ఖర్చు అవుతుందని, ఎకరానికి రూ.50 వేలు ముందస్తుగా కౌలు చెల్లించాలని రైతులు వాపోయారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవటంతో అప్పులపాలు అవుతున్నామని రైతులు తెలిపినట్లు చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వాలే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు భైరవపట్నం రామకృష్ణ, సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు పాండు ఆకుల శ్రీనివాసరావు, రైతు నాయకులు రామయ్య నాగేశ్వరరావు, మదర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటరు జాబితా రూపొందించాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి రమణాకాంతరెడ్డి



అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణాకాంతరెడ్డి

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 ఓట్లకు మించి ఉండకూడదని, పారదర్శక ఓటరు జాబితా రూపొందించాలని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీ రమణాకాంత రెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని మున్సిపల్ కమిషనర్, నాలుగు మండలాల తహసీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మృతుల ఓట్లు తొలగించడంతోపాటు కొత్త ఓటర్ల నమోదు పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, సవరణలకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందన్నారు. చేర్పులు, పోలింగ్ కేంద్రాల మార్పులు తదితర అంశాలపై సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

నాచు తొలగక.. నీరు అందక



నాచు అడ్డుపడడంతో ముందుకు సాగని నీరు

గరికపాడు కాలువలో నాచు పేరుకుపోవడంతో అందని సాగునీరు



బెల్లంకొండలోని కాలువలో నిలిచిపోయిన నాచు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ నుంచి గరికపాడు వైపు వెళ్లే ఎన్‌ఎస్‌పీ మేజర్ కాలువలో నాచు పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. మండలంలోని బెల్లంకొండ విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో కాలువలో డ్రాప్‌కు నాచు అడ్డుపడి నీరు ముందుకు సాగడం లేదు. గత వారంలో మేజర్ కాలువలో పూడిక తీయడంతో నాచు కొట్టుకుని వచ్చి ఈ డ్రాప్ వద్ద నిలిచిపోయింది. దీంతో దిగువ ప్రాంతాల్లో పంటలకు సాగునీరు అందడం లేదు. నాచు తొలగించాలని ఇరిగేషన్ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి డ్రాప్ వద్ద నిలిచిపోయిన నాచును తొలగించాలని, పంటలకు నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ దీపాలతో ముస్తాబయిన జామియా మసీదు



రాజుపాలెం: రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా మండలంలోని రెడ్డిగూడెంలో మండల మర్కస్ జామియా మసీదును కనులు మిరుమిట్లు గొలిపేలా విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. శుక్రవారం ఉపవాస ప్రార్థనలలో ఎక్కువ మంది ముస్లిం సోదరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

పార్టీలో సీనియర్ల మృతి తీరనిలోటు

వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ భార్గవ్‌రెడ్డి

నకరికల్లు: పార్టీలోని సీనియర్ నాయకులు, కార్యకర్తల మృతి తీరనిలోటని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రూపెనగుంట్ల గ్రామానికి చెందిన నారపరెడ్డి వలసారెడ్డి(80) రైలు ప్రమాదంలో కంభం సమీపంలో మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం రూపెనగుంట్లకు గురువారం చేర్చారు. విషయం తెలుసుకున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి గ్రామానికి చేరుకొని వలసారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, కోనంకి ఆదినారాయణ, వెంకట్రావు, పానెం శివగంగరాజు, మద్దం సుబ్బయ్య, గోగా కిట్టయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

చెత్తను కాల్చివేస్తున్న స్థానికులు



పెదకూరపాడు: స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర అంటూ పాలకులు పెద్ద ఎత్తున్న ప్రచారం చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు మేజర్ పంచాయతీలో ఎక్కడి చెత్త అక్కడే వేస్తూ చెత్త శుద్ధిని నిరూపించుకుంటున్నారు. చెత్త నుంచి సంపద ఎలా ఉన్నా.. రోడ్డు పక్కన చెత్త వేయడంతో దుర్వాసన వెదజల్లుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు వార్డుల్లో చెత్త సేకరించే వారు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో స్థానికులు చెత్తను రోడ్డు పక్కనే వేస్తున్నారు. వాటి దుర్వాసన భరించలేక తగలబెడుతున్నారు. ఇకనైనా చిత్త శుద్ధితో స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలని గ్రామ ప్రజలు ఆశిస్తున్నారు.

కష్టాల్లో ఉన్న రైతులకు సాగునీరు ఇవ్వండి

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అచ్చంపేట: వర్షాలు ఎక్కువై పత్తి, సకాలంలో వర్షాలు లేక తెగుళ్లతో దిగుబడి గణనీయంగా తగ్గిన మిర్చి, పండిన కాస్త పంటలకు కూడా గిట్టుబాటు ధరలు లేక పీకల్లోతు కష్టాలలో ఉన్న రైతులను ఆదుకోండి.. రబీ పంటలుగా వేసిన వరి, మొక్కజొన్న, పొగాకు వంటి పంటలకైనా సాగు నీరిచ్చి ఊరటనివ్వాలంటూ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నాగార్జునసాగర్ కెనాల్స్ అధికారులను కోరారు. చింతపల్లి మేజర్ కెనాల్ ద్వారా సాగు నీరు వదలడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే గురువారం ఎన్‌ఎస్పీ అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. చింతపల్లి మేజర్ కింద సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, ఆ భూములలో రబీ పంటలు వేసిన రైతులు నీళ్ల రాక అల్లాడుతున్నారని, సాగునీరు వదలడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు ఇబ్బంది లేకుండా తక్షణమే సాగునీరు వదలాలని డిమాండ్ చేశారు. రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి, దిగుబడులు లేక, పండిన పంటలకు మద్దతు ధరలు లేక అల్లాడుతున్నారని, అన్నంపెట్టే రైతుకు అండగా నిలబడాలని సూచించారు. ఈ ఏడాది ఏ ఒక్క పంట సక్రమంగా లేకపోవడంతో మళ్లీ కరువు పరిస్థితులు దాపురించాయన్నారు. వరి పొట్ట దశలో ఉందని, మిర్చి, మొక్కజొన్న, పొగాకు, మినుము, పెసర తదితర పంటలు సాగునీరు లేక ఎండిపోతున్నాయని కనికరం చూపాలని రైతుల తరపున శంకరరావు అధికారులకు మొరపెట్టుకున్నారు. శంకరరావు విజ్ఞప్తితో స్పందించిన ఎన్‌ఎస్పీ అధికారులు శుక్రవారం సాయంత్రానికి చింతపల్లి మేజర్ కింద ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థులతో యోగా చేయిస్తున్న వైద్యులు శ్రీనివాస్, సిబ్బంది

బెల్లంకొండ: వేసవి కాలంలో వడ దెబ్బకు గురికాకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని మండల ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో వడదెబ్బ నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి కాలంలో విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరించారు. అధిక మొత్తంలో నీటిని తాగాలని సూచించారు. వేసవి సెలవుల్లో ఎండలో తిరగకుండా, నీడ ఉండే ప్రదేశాలలో ఆడుకోవాలని సూచించారు. బయటకు వచ్చే సమయంలో తప్పనిసరిగా తలకి టోపీ పెట్టుకోవాలని, రెండు పూటలా చల్లని నీటితో స్నానం చేయాలని సూచించారు. అనంతరం వ్యాధి నిరోధక శక్తి పెంచడానికి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. విద్యార్థులతో యోగాసనాలను చేయించారు. పాఠశాల సిబ్బంది పెద బాబు, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఉషారాణి, ప్రసాద్, సులోచన, యోగా టీచర్ హనుమంత రావు నాయక్ పాల్గొన్నారు.

జ్యోతి ఆత్మహత్యాయత్నానికి కారకులపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవో రమణాకాంతరెడ్డి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు, ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు

సత్తెనపల్లి: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక అంగన్‌వాడీ కార్యకర్త గుజ్జర్లపూడి జ్యోతి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ, ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్యోతిని గురువారం పరామర్శించారు. ప్రజా సంఘాల నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి జ్యోతి ఆత్మహత్యాయత్నానికి కారకులైన పీడీ ఉమాదేవి, నోడల్ అధికారి అరుణ, ఇరువురు పత్రికా విలేకర్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ మాధవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడి నుంచి ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయం వద్దకు బయలుదేరిన అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ప్రదర్శనకి అనుమతి లేదని పోలీసులే ఆటోలను పిలిపించి వారిని ఆర్డీవో కార్యాలయానికి తరలించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జ్యోతి ఆత్మహత్యాయత్నానికి కారకులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఆర్డీవో రమణాకాంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, ఐద్వా పట్టణ కార్యదర్శి జి.ఉమాశ్రీలు మాట్లాడుతూ మహిళా, శిశు సంక్షేమం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు తక్కువ వేతనాలతో కేంద్రాలను నడుపుతున్నారన్నారు. వారికి ఎన్ని బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వహిస్తున్నా.. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వేధింపులు తప్పడం లేదన్నారు. ఈ నెల 17న ఐసీడీఎస్ పల్నాడు జిల్లా పీడీ ఉమాదేవి, నోడల్ అధికారి అరుణల విజిట్‌లో 27వ వార్డు అంగన్‌వాడీ కార్యకర్త జి.జ్యోతిపై ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు కల్పించి రిమార్కులు రాయడం అన్యాయమన్నారు. దీంతో మనస్థాపానికి గురైన జ్యోతి ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలని, లేకుంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని, డీవైఎఫ్ఐ నాయకులు జడ రాజకుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



క్రోసూరు సచివాలయంలో ఆధార్ కేంద్రం

బెల్లంకొండ: ఆధార్ నవీకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని బెల్లంకొండ, కందిపాడు గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ నమోదు సేవలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కందిపాడు గ్రామంలో ఏడాది పొడవునా ఆధార్ సేవలు అందుతాయని, బెల్లంకొండలో ఈ నెల 28 వరకు ప్రత్యేక క్యాంపు ద్వారా సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవజాత శిశువులకు బాల ఆధార్ నమోదు, 5 ఏళ్ల నుంచి 15 ఏళ్లు దాటిన వారందరూ తమ ఆధార్ కార్డులు తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను ఆధార్ కార్డులో మార్పులుచేర్పులు, బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ కాశయ్య గురువారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు, 25 నుంచి 28వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు నిర్వహించటం జరుగుతుందన్నారు. 21న దమ్మాలపాడు, ఇరుకుపాలెం, 22న దమ్మాలపాడు, ముప్పాళ్ళ, 25న బొల్లవరం, ముప్పాళ్ళ, 26న బొల్లవరం, ముప్పాళ్ళ, 27న రుద్రవరం, చాగంటివారిపాలెం, 28న మాదల, గోళ్ళపాడు గ్రామాల్లో క్యాంపులు జరుగుతాయన్నారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జరిగే క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు

క్రోసూరు: క్రోసూరు సచివాలయంలో గురువారం నుంచి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయటంతో ఆధార్ కార్డు నమోదు చేసుకోవాల్సిన వారు, పేర్లు, చిరునామా సవరణ, ఫోను నంబర్ లింకింగ్, విద్యార్థులకు అవసరమైన ఆధార్ మార్పులు చేర్పుల కొరకు తల్లిదండ్రులు, ప్రజలు ఆధార్ కేంద్రానికి చేరుకున్నారు. ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో జి.శ్రీనివాస్, పంచాయతీ బిల్ కలెక్టర్ ఆదినారాయణ పరిశీలించారు. శుక్రవారం కూడా ఆధార్ కేంద్రం పనిచేస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఎంపీడీవో కోరారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



నకరికల్లు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడడంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కుంకలగుంట సమీపంలో గురువారం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నా యి. రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన మక్కెన వీరయ్య (60) తన ద్విచక్ర వాహనంపై మండలంలోని కుంకలగుంట గ్రా మంలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. కుంకలగుంట శివారున గల రైల్వే బ్రిడ్జి సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ క్రమంలో తల దిమ్మెకు గుద్దుకోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య అచ్చాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు. మృతునికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సునీతా విలియమ్స్‌కు శుభాకాంక్షలు

ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్



క్రోసూరు: తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకొని భూమికి చేరుకున్న సందర్భంగా భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీత విలియమ్స్‌కు మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ అంతరిక్ష పరిశోధన రంగంలో విశేష సేవలు అందించిన సునీత విలియమ్స్ ధైర్యసాహసాలు, అంతరిక్ష ప్రయోగాల్లో వారు చూపించిన నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో ఆమె మహిళా శక్తికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. సునీత విలియమ్స్ సాధించిన ఘనత ప్రపంచ వ్యాప్తంగా పరిశోధకులకు, వ్యోమగాములకు, యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. అంతరిక్షంలో పలు సవాళ్లు ఎదుర్కొని విజయవంతంగా భూమికి చేరటం ప్రేరణాత్మకమని వీరి ప్రయాణం భవిష్యత్తరాలకు మార్గదర్శకమన్నారు. ఇది నిజమైన సాహస యాత్ర అని కొనియాడారు. దేశానికి వన్నె తెచ్చిన వ్యోమగామి సునీత విలియమ్స్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు శ్యాంసన్ తెలిపారు.